# 'నేను ఉన్నాను'

"అబ్బబ్బ! లోకమంతా స్టేటస్ స్టేటస్ అని అలా పరుగులు తీస్తుందేమిటి! గొప్పపండితుడూ విద్యావంతుడూ మేధావీ స్టేటస్ లేకపోతే గౌరవనీయుడుకాడా? అటువంటివాళ్లకు సంఘంలో గుర్తింపులేదా? ఏంలోకమిది? అన్నీ తెలిసినవాళ్లే ఇట్లా ప్రవర్తిస్తుంటే సామాన్య ప్రజానీకం మాట చెప్పాలా?" ఆరోజు పత్రిక చదివిన వాసు ఆవేశంతో అన్నాడు శంకరాన్ని చూడగానే.

"ఏమయిందేమిటి అట్లా పిడుగులవర్షం కురిపిస్తున్నావు?" కూర్చోకుండానే అడిగాడు శంకరం.

"పేపర్‌చదవలేదా? చదవకపోతే ఇప్పుడు చదువు. 'ఓఅంటే న'రాని వాడి నొకడిని అధ్యక్షుడిగా ఎన్నుకుని సభలునిర్వహిస్తున్నారట అదేదో ఊళ్ళో. పైగా ఆ సభలో పండితులు చదువుకున్నవాళ్ళెందరో ఉన్నారట. వాళ్ళు అధ్యక్షోపన్యాసం విని ఒకటే నవ్వుకోవటమట. ఆ అధ్యక్షుడు ఒక కోపరేటివ్‌సొసైటీ అధ్యక్షుడట" అన్నాడు ముక్కు చిట్లించుకుంటూ.

విరగబడి నవ్వాడు శంకర్.

"నవ్వుతావేం?"

"కోపం తెచ్చుకోకు. ఓ అంటే న రానివాడని నీవంటే నవ్వొచ్చింది అంతే."

"నవ్వురావటానికి ఏముంది దానిలో?"

"ఓఅంటే ఓఅనే అంటారుగాని న ఎట్లా అంటారని నవ్వొచ్చింది అంతే."

"ప్రతిదానిలోనూ ఏదోవంక పెడతావురా శంకర్‌నీవు. ఓ అంటే'న' రాదంటే అర్ధమేమిటంటే ఓనమాలయినారావని అర్థం తెలిసిందా?"

"సరే బాబూ! ఇప్పుడు బాగా అర్ధమయింది. ఇంక అసలుసంగతి చెప్పు?"

"ఈ కాలంలో చదువుకూ పాండిత్యానికి విలువలేదా అని అడుగుతున్నాను"

"చూడు వాసూ, ఒక కాలంలో రాజులుకూడా పండితులై ఉండేవారు. కావ్యాలురాశారు. వాళ్ళకు గౌరవమూ అధికారమూ ఉండేవి. ఆ రాజులుకూడా పండితులను గౌరవించేవారు. అధికారంలేదని కవిపండితులను నిరసనగా చూడ లేదు. ఇప్పుడు ఎంతమంది మేధావులున్నా, పండితులూ విద్యావంతులూఉన్నా, ప్రజలకంటికి ఆనటంలేదు. అధికారాన్నీ అంతస్తునీచూసి గౌరవిస్తున్నారు. కొందరికి ధనవంతులనుచూసి ఆరాధించటం ఒక వ్యామోహం. కొందరికి అధికారాన్నీ అంతస్తునూచూసి అరాధించటం గౌరవించటం, వాళ్ళవెంట తిరగటం ఇదొకరకమైన వ్యామోహం. ఈ విషయాలు ఈ కాలంలోజరుగుతున్నవే. నీ కర్థం కావటంలేదని బాధపడతారెందుకు? లోకంలో ఎన్నిరకాలున్నాయో? ఆ రకాల నన్నిటినీ నీవు సంస్కరించగలవా? ఇటువంటివన్నీ మనంచూసి ఊరుకోవాలి. కాని-ఆవేశపడితే ఏంలాభం?"

శంకర్ వాసు స్వభావాన్ని బాగా అర్థంచేసుకున్నవాడు కనుక అతడి ఆవేశాన్ని చల్లబరచటానికి ప్రయత్నం చెయ్యబోయాడు. ఇద్దరూ మంచి స్నేహితులే కాని-ఇద్దరి స్వభావాలలో ధ్రువాంతర భేదముంది. ఒకరి నొకరు కలుసుకున్నప్పుడు బాగా విమర్శించుకుంటారు. అరుచుకుంటారు. వాళ్ళ ధోరణి చూసినవాళ్ళు ఆ యిద్దరూ మళ్ళీ కలుసుకుంటారని అనుకోరు.

కాని-వాళ్ళు కలుసుకోకుండా ఉండలేరు.

"నాకు అర్థంకాకకాదు. ఏమిటా వ్యామోహమని నా బాధ" అన్నాడు వాసు మళ్ళీ మొదటికివచ్చి.

శంకర్ బిగ్గరగా నవ్వేడు.

ఆనవ్వులో వ్యంగ్యం ఉన్నట్టు వాసు కనిపించింది ముఖం ముడిచాడు.

"వాసూ! చెప్పేనా అదొక వ్యామోహమని? వ్యామోహాలను మనం తుడిచి పెట్టగలమా? మనం మనుష్యులమన్న గౌరవంకూడా పోతుంది. మనం చేయగలి గింది ఒక్కటే. వాళ్ళు అలా వ్యామోహపడటానికి కారణమేమిటి? 'దీనిలో స్వార్థ ముందా? ఉంటే అదెటువంటిది?' అని ఆలోచించి తెలుసుకోవాలి. లోకంపోకడను గురించి గ్రహించుకోవాలి. అంతే" అన్నాడు శంకర్ చాలా నెమ్మదిగా.

"నీ కెప్పుడూ 'అది గ్రహించాలి-ఇది తెలుసుకోవాలి-లోకంపోకడను గమనించాలి' అంటూ ఉపదేశం చెయ్యటం ఒక వ్యామోహం. సందుదొరికితే ఒక ఉపదేశమిస్తావు" కనుబొమలు ముడివడ్డాయి వాసుకు.

"ఈ లోకంలో ఉన్నవాటినీ లోకం పోకడను, బాగా గమనించాలనటం కూడా ఒక వ్యామోహమేనా?" శంకర్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"కాదా? పనికిమాలిన విషయాలనుగురించి జిజ్ఞాసతో కొట్టుకుపోయేవాడిని ఒక విధంగా పిచ్చివాడంటారు." వాసుకు ఒళ్ళు మండిపోతున్నది శంకర్ సమాధానాలకు.

"వాసూ, మనకునచ్చనిదీ మనకు అర్థంకానిదీ పనికిమాలినవనుకోవటమూ, అవి లోకంలో ఉండకూడ దనుకోవటమూ నీ స్వభావం" అన్నాడు శంకర్ మామూలుగా.

కొంతసేపు వాసు మౌనం వహించాడు. అతడికి కంపరమెత్తినట్లవుతోంది. కాని-తనకు ఒక్కడే స్నేహితుడు. ఆ ఒక్కడూ తనకునచ్చని, మెచ్చని విషయాలలోకి దింపి విమర్శించి వెర్రివాడిక్రింద జమకట్టేస్తున్నాడు. ఎప్పుడూ తన మాటలను ఖండించటమే అతడిపని. స్నేహితుడిని కలుసుకున్నానన్న సంతోషాన్ని మిగలనివ్వడు?

"అయినా అతడేదో అన్నాడని నేనెందుకు బాధపడాలి ? అతడికేంతెలుసునని నాకుచెప్పబోతాడు?"

ఈ నిర్ణయానికి వచ్చినతరువాత వాసు మనసు కొంత తేలికపడ్డది. శంకర్ వెళ్ళిపోయిన తరువాతకూడా అలాగే కూర్చుండిపోయాడు.

వాసు నాలుగైదు భాషలు తెలిసినవాడు. గ్రంథాలయాలలోని పుస్తకాలన్నీ తిరగవేసినవాడు. ఏవిషయం ఏ గ్రంథంలోఉన్నదో చెప్పగలిగినవాడు. ప్రతి విషయాన్నిగురించీ అంకెలూ అంశాలూ అతడి గోటిమీదనేఉంటాయి. కాని-అతడిని చూడగానే ఒక విధమైన భావం ఎదటివారికి కలుగుతుంది. అది గౌరవాభిమానాలకు సంబంధించింది మాత్రంకాదని అతడి ప్రవర్తనవల్లనే తెలిసిపోతుంది. అతడిలో 'నేను' అన్నభావం బాగా పాతుకుపోయింది.

నాలుగురోజులు తరువాత శంకర్ వాసును కలుసుకున్నాడు-"శంకర్.

మొన్న మనం కలుసుకున్నప్పుడు అనుకున్నాం చూడు ? నీవు అదొక వ్యామోహ మన్నావు ? వ్యక్తిపూజను గురించి నీవేమంటావు ? ఒక సామాన్య మానవుడు- ఏ విషయంలోనూ చెప్పుకోతగనివాడు-అటువంటి వాడిని ప్రజలంతా చుట్టూచేరి కొలు స్తారు. ఎందుకని ? ఏం చూసి ?''

''ఎందుకురా నన్నడుగుతావు ఈ ప్రశ్న ? నేనేది చెప్పినా నీకు నచ్చదు. నమ్మవు ''

"నామాట వదిలిపెట్టి. నీవు ఏమనుకుంటావో అదే చెప్పు ? ప్రతి విష యాన్ని గురించీ నీవేమనుకుంటావో నాకు తెలియాలి." అలవాటు చొప్పున వాసు నడిగాడు. కాని కంఠంలో అధికారస్వరం ధ్వనిస్తోంది.

''పోనీలే. నీవు కాదన్నా లేదన్నా చెప్పటం నాకలవాటు. దాన్ని ఒక్క రోజులో మార్చుకోలేము కదా ? అందుకే చెబుతున్నాను. దీనివల్ల అభిప్రాయ భేదాలు ఎట్లావస్తాయి. నీవు మూతిముడచుకుంటావు. అటువంటివన్నీ మనకు మామూలే అనుకో విను. ప్రజలు ఒక సామాన్య వ్యక్తిని అంటే డబ్బులేని వాడిని స్టేటస్ లేనివాడిని గౌరవభావంతో చూసి ఆ వ్యక్తి వెంబడి ఎందుకు పడ తారనేగా నీ ప్రశ్న? బాగా విను. ఆ వ్యక్తిలో వాళ్ళను ఆకర్షించే అంశమేదో ఉండి ఉంటుంది. ఆ అంశము తరతమ భేదాలులేకుండా ప్రజలందరి సుఖజీవ నానికి మార్గము చూపేదయి ఉంటుంది. కొందరు అతడి శక్తిసామర్థ్యాలను గ్రహించి ఆకర్షితులు కాగానే మరికొంతమంది వారిని వెంబడిస్తారు"

"అంటే గొర్రె దాటంటావా ?" వెంటనే వాసు అన్నాడు.

"ఆ మాట నేననలేదు. వారిలో కొందరు స్ఫురద్రూపులు. ఆ వ్యక్తిలోని గుణాలో-మాటలో-చేతలో-అందరినీ సమదృష్టితో చూడగల శక్తో-మానవతా విలువో గమనించి అనుసరిస్తారు. వారిద్వారా విని మరికొందరు ఆకర్షితులవుతారు. ఒకమంచి విషయం దేశవ్యాప్తం చేయటంలో తప్పేముంది ? గాంధీజీని ఎంత మంది అనుసరించారు ? అది గొర్రెదాటా ? కాదే ? స్వామి వివేకానంద విదేశాలలో కూడా హిందూమతంలోని ఔన్నత్యాన్ని ప్రజ్వలింపచేసే ఉపన్యాసాలిచ్చాడే? విదేశీయులు ఆ ఉపన్యాసాలు చిత్తరువులలోని బొమ్మలయి చెవులు దొరగిల పెట్టుకుని విన్నారే. ఆ సంగతి విని మన దేశీయులంతా ఆ ఉజ్వల ఘట్టాలను

తెలుసుకుని ఆయనను గురించి గొప్పగా చెప్పుకున్నారు. ఆయనను ఎంతో గౌరవించారు. ఇప్పటికీ తెలియనివాళ్ళకు చెబుతున్నాను. ఆయనను భక్తిభావంతో కొలుస్తున్నారు. ఆయన నిలువెత్తు విగ్రహాలను దేశమంతటా ప్రజలు మరిచిపోకుండా స్థాపనచేశారు ఇదీ గొప్పదా టేనా చెప్పు?''

"అబ్బా ? నీవు చెప్పేదంతా నేను వినలేకుండా ఉన్నాను. నేను నమ్మను. నీ కంపేరిజాన్ని నమ్మలేను." కరుకుగా అనేశాడు వాసు.

''నీవు నమ్మటం నమ్మకపోవటం అది వేరేవిషయం. నీవు అడిగావు కనుక చెప్పాను. అంతే." శంకర్ అతడి ముఖంలోకి చూశాడు.

''శంకర్ ! ఈ విషయాన్ని ఇంతటితో పోనిద్దామా ! లేక మరెప్పుడైనా అందుకుందామా ?" అన్నాడు వాసు విసుగుదలను పైకి కనబడనీయకుండా.

''అది నీయిష్టం''

వాసు శంకర్ సహాధ్యాయులు కారు. ఒక ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగులూ కారు. ఎవరి విధులు వారివి. ఎవరి వ్యాపకాలు వారివి.

ఆ ఊళ్ళో ఒక కాలవ ఊరిమధ్యగా ప్రవహిస్తూ ఉంటుంది. ఆ కాలవకు రెండుపక్కలా బల్లకట్లూ పడవలూ ఆగటానికి రేవులు ఉన్నాయి. గ్రామస్థులు మంచినీళ్ళు తీసుకుపోవటానికీ స్నానాలకూ రాతిమెట్లతో రేవులు విడిగాఉన్నాయి. ఇవిగాక-గట్లు తెగిపోయిన చోట ఇసుక పరచినట్టుగా ఉంటుంది. గ్రామస్థులలో కొందరు దానినే సముద్రవుటొడ్డుగా భావించి, సాయంకాలపు వేళ చల్లగాలికి అక్కడికి చేరుకుంటారు.

అదిగో-అక్కడే-ఏ ఊరినుంచో బదిలీ అయివచ్చిన శంకర్, వాసును కలుసుకున్నాడు మొదటిసారిగా.

ఆ మొదటి రోజున ఆత్మీయంగా మాటాడుకున్నారు ఇద్దరూ. ఇద్దరూ బాగా చదువుకున్నవాళ్ళు. ఆలోచనాపరులు. అన్ని విషయాలపైన తమతమ అభిప్రాయాలను కచ్చితంగా వెల్లడించగలరు. ఆ పరస్పరం వెల్లడించుకోవటంలోనే అభిప్రాయ భేదాలు వస్తూఉంటాయి. గట్టిగా నిర్మొహమాటంగా అరుచుకుంటారు. చూసేవాళ్ళకు కొట్టుకుంటారేమోననిపిస్తుంది. కాని ఆ యిద్దరికీ అది అలవాటయింది.

ఆ యిద్దరిలో శంకర్ డిగ్రీ చదువేకాక ప్రపంచాన్ని కూడా చదివినవాడు. లోకానుభవం కలవాడు. మనిషిని చూడగానే అతడి స్వభావం ఎటువంటిదో గ్రహించగలిగిన వాడు. కాని ఉద్రేకికాడు. సౌమ్యుడు. మర్యాదా మన్ననా తెలిసిన వాడు. వాసు ఉద్రేకాన్ని తగ్గించటానికి గట్టిగా మాట్లాడతాడేగాని మనసులో వాసును ఏ విధంగా దారిలోకి తీసురావాలా అన్న ఆలోచన ప్రస్ఫుటంగా కనబడుతుంది.

శంకర్ మామూలుగా మాట్లాడేటప్పుడు ''నీవు ఆలోచించే విధానంమారాలి. ఎంత చదువుకున్నా పాజిటివ్ థింకింగును అలవాటు చేసుకోవాలి. కాని-నీవు వక్రంగా ఆలోచిస్తావు'' అంటూఉంటాడు నవ్వుతూ.

"పాజిటివ్‌గా కాక ఎట్లా ఆలోచిస్తాననీ? వక్రంగానా?'' ఉద్రేకంతో అప్పటికప్పుడు ముఖం ఎర్రబడిపోతుంది వాసుకు.

శంకర్ వాసు స్వభావాన్ని అణువణువూ పరిశీలించి చూశాడు. అన్నిటికి నైరాశ్యం. పైకి కనబడని బాధ మనసులో ఉంటుంది. ఆ బాధలో వాగ్ఘోషం పైకి ఉబికిఉబికి వస్తుంది. అతడు అందరితో కలవలేడు. కలిసి సౌమ్యంగా మాట్లాడలేడు. అందుకని అతడు అందరినీ ఆకర్షించలేడు. ఎవరూ అతడిని కలుసుకోవాలనుకోరు. అతడు ఒంటరిగాడైపోయాడు. తనను ఎవరూ లెక్క చేయరని మరీ బాధపడతాడు.

అతడికి వాస్తవంగా నైరాశ్యమా?

ఎందుకు?

ఏంతక్కువయిందని?

అదేమిటో తెలుసుకోవటానికే-అతడి మనసులో ఉన్నదేమిటో వెళ్ళ గ్రక్కించటానికే-శంకర్ అనేక ప్రయత్నాలు చేస్తాడు. వాసు అలిగినా అరిచినా సహిస్తాడు.

వాసు తన మనసులో ఉన్నది ఉన్నట్టు వెళ్ళగ్రక్కటానికి సందేహించడు. వాసు మాట్లాడే మాటల్లో ఓర్పు నిదానం తక్కువ. ఎదుటివాడి మాటల్లో సత్యమే మయినా ఉందా లేదా అని చూడడు. ముందూవెనకా చూడకుండా మాట్లాడేస్తాడు. తనస్థాయికి ఎదుటివాడిస్థాయి చాలా తక్కువనే భావిస్తాడు. అందరూ అవునన్న దానిని కూడా అవుననటానికి అతడి మనసు అంగీకరించదు.

అతడికి సంతోషాన్ని కలిగించటానికి శంకర్ ఎంతగానో ప్రయత్నిస్తాడు. వాసుకి జీవితంలో కొరత ఉందా అంటే- మంచి ఉద్యోగం, బుద్ధిగా చదువుకునే ఇద్దరు పిల్లలు, తెలివిగల భార్య, పరోపకారిణి, అటువంటి భర్తతో సర్దుకుపోయే గుణం కలది. లోకంపోకడ ఎరిగినది.

మరెందుకా అసంతృప్తి?"

ఎందుకా వక్రసంభాషణ?

అంత చదువుకున్నా కూడా అతడి ఆలోచనాసరళి ఎందుకు వక్రమార్గాన పడ్డది?

శంకర్‌కి ఇవే ఆలోచనలు రాత్రింబవళ్ళు.

కాలచక్ర భ్రమణంలో రెండు సంవత్సరాలు జరిగాయి.

వాసు పనిచేసే ఆఫీసులో కొన్ని మార్పులు జరిగాయి. పెద్ద ఆఫీసరు కొత్తగా వచ్చాడు. ఆయన పద్ధతి ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు మూడు సంవత్సరాలకంటే ఎక్కువకాలం ఉండకూడదని, ఉన్నచోటినుంచి మరొకచోటికి బదిలీచేస్తూ ఉంటాడు. ఈ సూత్రాన్ననుసరించి వాసుకి వెంటనే మరో ఊరికి బదిలీ అయింది.

ఈ సంగతి తెలిసిన మరుక్షణం "అమ్మయ్య, శంకర్ ఇంక వదిలిపోతాడు" అనుకున్నాడు వాసు.

ఆ సాయంత్రం శంకర్ కనబడినప్పుడు "నాకు బదిలీ అయింది. వచ్చే వారం ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నాను" అన్నాడు ఉల్లాసంతో.

"అలాగా, వాసూ, నీవు వెళ్ళిపోతావంటే నాకు బాధగాఉంది. మొదట మనం కలుసుకున్నప్పటినుంచీ ఇప్పటివరకూ ఎంత వాదించుకున్నా స్నేహితులుగానే ఉన్నాము. నీవెక్కడికి వెళ్ళినా నన్ను మరచిపోకు" అన్నాడు శంకర్.

"అట్లా ఎన్నటికీ జరగదు. ఎవరినైనా మరిచిపోవచ్చు గాని నిన్ను మరిచిపోవటం సాధ్యంకాదు. ఎప్పుడూ మరిచిపోవటానికి వీలులేకుండా చేస్తావు" అన్నాడు రెండర్థాలు వచ్చేటట్టుగా.

"పోనీలే, అది నా స్వభావం. ఇంతకాలము నన్ను సహించినందుకు నా కృతజ్ఞతలు.

"నీవు వెళ్ళేటప్పుడు స్టేషన్‌లో కలుస్తాలే."

"వీలయితేనే. వీలుకాకపోతే బాధపడకు" అన్నాడు వాసు.

వాసు వెళ్ళేనాడు శంకర్ ఇంట్లో సకుటుంబంగా భోజనం చేశాడు. వాళ్ళ ఇంటినుంచే స్టేషన్‌కి బయలుదేరాడు. శంకర్ కూడా స్టేషనుకి వెళ్ళి రైలు కదిలే వరకూ ఉండి, "ఆ ఊరు వెళ్ళగానే ఉత్తరం రాయి" అంటూ వెనక్కి తిరిగాడు.

వాసుకి కొండంత బరువు తలపైనుంచి దిగినట్లయింది. తనమాట కెదురు చెప్పి, తనను కించపరిచేవారు ఇంక ఎవరూఉండరన్న సంతోషంతో 'అమ్మయ్య' అనుకున్నాడు.

వెళ్ళినచోట, ఆఫీసుకు వెళ్ళటమూ సాయంత్రానికి ఇంటికి రావటం జరుగు తోంది. తోటి ఉద్యోగులు ఒక్కొక్కరే వచ్చి తమనుతామే పరిచయం చేసుకు న్నారు. వాసు సంతోషించినట్టుగా ముఖంపెట్టి. తన పరిచయం కూడా చేసు కున్నాడు.

కాని- అతడితో మాట్లాడేవాళ్లు లేక ఒంటరితనమనిపిస్తోంది. దానినే బాధ అంటారు కాబోలు.

వాసు సాయంకాలపువేళలు గడపటానికి ఆ ఊర్లో ఏమయినా ఉందేమో నని చూశాడు. క్లబ్బు-లైబ్రరీ కలిసిన దొక సంస్థ కనబడ్డది. దానిలో చేరిన రెండునెలలకే అతడికి అయిష్టత కలిగింది.

ఆ క్లబ్బులో ఉన్న రెండునెలలలో విశేషమైన వార్త ఒకటి వినవచ్చింది. ఆ ఊరిలో ఒక ధనికుడైన వ్యాపారి చనిపోతూ, తన కొడుకులతో సంవత్సరాని కొకసారి ఒక కవిపండితుడికి శాలువతో ఐదువేల రూపాయల సన్మానం చేయవల సినదని చెప్పాడుట. వెంటనే కార్యదక్షత గల యువకులతో ఆ వ్యాపారి కొడు కులు ఒక కమిటీగా ఏర్పడి సన్మాన కార్యక్రమాలు జరుపుతున్నారు. పండితు లనూ, కవులనూ ఎన్నికచేయటంలో చురుకైన శరభయ్య కార్యదర్శి హోదాలో నిర్వహిస్తూ ఉంటాడు ఆ పనులన్నీ.

ఆ సంవత్సరము ఒక గొప్ప పండితుడిని ఎన్నుకుని సన్మానం తలపెట్టారు. సన్మానసభ కమ్యూనిటీ హాల్లో జరపటానికి నిశ్చయమైంది.

సన్మానసభకు అధ్యక్షత వహించటానికి ఊరిలో ఉంటున్న అడ్వొకేటును ఎన్నుకున్నారు. ఆయన సంస్కృతాంధ్ర ఆంగ్లభాషలలో పాండిత్యం గలవాడు. అందరూ ఆకర్షించే విధానంగా ఉపన్యాసమివ్వగల గొప్ప వక్త. ఆ ఉపన్యాసం వినటానికే చాలామంది సభకు వస్తారు ఆ ఊళ్ళో. గౌరవం యిచ్చి పుచ్చుకునే వ్యక్తి.

సన్మానసభ ఆ అడ్వొకేటుగారి ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్లో జరగబోతున్నదని తేదీ, సమయంతో కూడా కరపత్రాలు అచ్చువేయించి ఊర్లో అందరికీ పంచటం కూడా జరిగిపోయింది.

ఆ మరునాడు సభ జరుగుతుందనగా అడ్వొకేటుగారు హైకోర్టులో అత్యవసరమైన పని ఉన్నదని కమిటీవారికి తెలిపి ఊరికివెళ్ళాడు.

కార్యదర్శి అయిన శరభయ్యకు ఆసమయంలో అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నిక చేయాలన్న సమస్య వచ్చింది. అంతటి పండితుడిని సన్మానం చేసే సభకు అధ్యక్షుడిగా ఉండతగిన వ్యక్తికోసం అందరితో సంప్రదింపులు జరుపుతున్నాడు.

పండితుడూ-వక్త కాకపోయినా పెద్ద ఆఫీసరయిన వసంతరావుగారిని ఆహ్వానించాలనుకుంటే ఆయనా ఊళ్ళోలేరని తెలిసింది.

ఎవరో సూచించారు- "వసంతరావుగారి ఆఫీసులో కొత్తగా బదిలీ అయి వచ్చిన వాసుదేవరావును అధ్యక్షుడిగా పిలిస్తేనో?" అని.

"ఆయన అహంభావిగా కనబడతాడు, తనతో మాట్లాడటానికి ఎవరూ తగరనుకుంటాడు" అని ఒకరన్నారు.

"ఆయన తనేదో గొప్పవాడినని అందరినీ తీసేసి మాట్లాడతాడు" అని మరొకరన్నారు.

"ఆయన గర్విష్ఠి, ఎవరితోనూ సరిగా మాట్లాడడు అందరినీ పిచ్చివాళ్ళ కింద జమకడతాడు" అని ఇంకొకరన్నారు.

అందరూ కలిసి ఎంత సేపాలోచించినా ఒక నిర్ణయానికి రాలేకపోయారు.

చివరకు శరభయ్య "ఆయననే పిలిచి చూద్దాం, చదువుకున్నవాడే కదా. పండి తుడిని చూసి అయినా మర్యాదగా గౌరవంతో మాట్లాడక పోతాడా? అంతమాత్రం సంస్కారం ఉండకుండా ఉంటుందా? మీలో ఒకరు నాతోకూడా రండి, వెళ్ళి ఆహ్వానించి చూద్దాం'' అని ఒక సభ్యుడిని వెంటబెట్టుకుని వెళ్లాడు.

వాళ్ళు వచ్చిన పని తెలుసుకుని "నాకిటువంటి అధ్యక్షపదవులు నిర్వహించటం చేతగాదండి. అలవాటు కూడా లేదు" అన్నాడు కొంచెం వాళ్ళను తీసివేసినట్టుగా.

కాని శరభయ్యకు మరొక మార్గం కనబడక, "అయ్యా, వాసుదేవరావు గారూ, మీరు బాగా చదువుకున్నవారనీ ఎంతో విజ్ఞానం సంస్కారం గలవారనీ, ఈ కార్యక్రమాన్ని మీరు తప్ప మరొకరు నిర్వహించలేరనీ మీదగ్గరికి వచ్చాము. మీరు కాదంటే ఈ సభను ఆపెయ్యవలసి వస్తుంది. పండితులు వచ్చారు. కరపత్రాలు అచ్చువేయించి పంచిపెట్టాము. ఇంత కాలంనుంచీ సక్రమంగా జరుపు కుంటున్న ఈ సన్మానసభ మీ అటువంటి పెద్దలు ఉండికూడా ఆగిపోవటం ఈ ఊరికే అవమానంగా ఉంటుంది. మీరు అన్యథా భావించక దయచేసి అంగీకరించండి. రేపు సమయానికి కారు తీసుకువచ్చి నేను మిమ్ములను తీసుకువెళ్తాను" అని ప్రాధేయపడ్డాడు.

"నన్ను గురించి విమర్శించటానికి శంకర్ లేడు. హాయిగా ఉన్నానను కుంటున్న వాసుకు స్వాతంత్ర్యం వచ్చినంత సంతోషం కలిగింది.

"మీరింతగా అడుగుతున్నారని కాదనలేకపోతున్నాను" అన్నాడు వాసు.

శరభయ్యకు అనుకున్న పని సులభంగానే అయిందన్న సంతోషం కలిగింది.

మరునాడు సరిగా అనుకున్న సమయానికి ఊరిజనమంతా వచ్చి కూర్చు న్నారు. వాసుదేవరావు పొంగిపోతూ ఉత్సాహంతో శరభయ్య కారులో సభకు బయలుదేరాడు

శరభయ్య అంతా సరిగా ఉన్నదో లేదోనని ఒకసారి చూసుకుని, మైక్ ముందరికి వెళ్ళి, "నేటి సన్మానసభకు అధ్యక్షులయిన శ్రీ వాసుదేవరావుగారినీ పండితులనూ వారికి సన్మానము చేయబోతున్న సోదరులనూ వేదికమీదికి రావల

సినదిగా కోరుతున్నాను" అని ఆహ్వానించగానే వాసుదేవరావు లేచి వేదికమీదికి వచ్చాడు. ఆయన వెనుక పండితులూ, సన్మానం చెయ్యబోతున్న సోదరులూ వచ్చారు. శరభయ్య వారినందరినీ పూలమాలాలంకృతులను చేసి, కుర్చీల మీద ఆసీనులు కండని కోరి, ప్రార్థనాగీతం పాడాడు. అధ్యక్షులనూ, పండితులనూ సభికులందరికీ పరిచయం చేసి వాసుదేవరావుగారిని కార్యక్రమము నిర్వహింప వలసినదని కోరాడు.

వాసుదేవరావు తనను ఆహ్వానించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ "పాండిత్యమన్నది దేవుడిచ్చిన వరము. చదువుకున్న వారందరూ పండితులు కాలేరు. చెవులకు కుండలాలూ, చేతికి బంగారు కంకణాలూ తగిలించుకున్న వారంతా పండితులని మనము భ్రమపడకూడదు. ఈ కాలంలో అందరు మేము పండితులమనే చెప్పుకుంటారు. పాండిత్యము మనిషిలోని మాలిన్యాన్ని క్షాళనం చేయాలి. అప్పుడుగాని మనిషి ముఖమ్మీద దివ్యతేజస్సు కనబడదు. ఆ దివ్యతేజస్సే పాండిత్యానికి గుర్తు. పాండిత్యాన్ని రాజకీయాలకు గాని లౌకిక కార్యక్రమాలకు గాని వినియోగించరాదు. ఈ కాలంలో పాండిత్యపు విలువలు దిగజారిపోతున్నాయి. మన దేశంలో పూర్వము ఉన్నట్టుగా గురుకులాలు స్థాపించి ఆ పద్ధతిలో విద్యాభ్యాసంచేసే పద్ధతిని ప్రవేశపెట్టి, అక్కడ సకలవిద్యలలోను ఆరితేరిన పండితులను మాత్రమే సన్మానాలుచేసే సంప్రదాయాన్ని నెలకొల్పాలి" అని, తన విద్యాభ్యాసము ఎంత కఠినమైన నియమాలతో జరిగిందో, తానెంత కష్టపడి విద్యనార్జించినదీ ఒక గంటసేపు అనర్గళంగా ఉపన్యసించాడు.

సన్మానం చేయబోయే సోదరులిద్దరూ లేచి పండితుడిని ఒక ప్రత్యేకమైన ఆసనంమీద కూర్చుండ చేసి, ఆయన పాదాలను ఒక పళ్లెంలోకడిగి, బట్టతో అద్దారు. పుష్పమాలవేసి కాశ్మీరు జరీపూలశాలువ కప్పి తాంబూలములో ఐదువేల రూపాయల కవరు పెట్టి పండితుడికి సమర్పించి పాదాభివందనం చేశారు.

అనంతరం పండితులు లేచి అధ్యక్షుల ప్రసంగానికి జవాబుగా నాలుగు శ్లోకాలు ఆశువుగా సభ్యులకు వినిపించి తనను సన్మానంచేసిన సోదరులను శ్లోకాలలోనే దీవించి కమిటీవారిని అభినందించారు. "ఎవరు ఏ తప్పు చేసినా ఏ విధంగా ప్రవర్తించినా క్షమించటమే పండితుల కర్తవ్యమని" అందరివైపూ ఒకసారి చూశాడు.

ఆ మాట వాసుదేవరావు చెవిన పడ్డది.

సభ ముగియగానే వాసుదేవరావుగారిని కారులో పంపిస్తూ, వచ్చి కార్యక్రమము బాగా నడిపించినందులకు శరభయ్య కృతజ్ఞతలు తెలిపాడు.

"అంతా బాగానే జరిగింది గాని ఆ పండితుడి క్షమాపణలు ఎవరిక్కావాలట ! ఏదో బ్రతిమిలాడి పిలిస్తే వచ్చాను గాని ఈ కుండలాల పండితుడిని చూసి రాలేదు" అన్నాడు వాసుదేవరావు.

శరభయ్య అతడిని పంపించి సభలోకి రాగానే "ఎవరూ తగిన వారు లేరు కదా అని ఈయనను అధ్యక్షులుగా రమ్మని ఆహ్వానిస్తే పండితులను అవమానిస్తూ, తనను గురించి గొప్పలు చెప్పుకుంటాడా ఈయన ?" అని అందరూ గొడవగా చెప్పుకుంటున్నారు. సన్మానం చేసిన సోదరులు చిన్నబుచ్చుకున్నారు.

శరభయ్య చేతులెత్తి అందరికీ నమస్కరిస్తూ, "ఆ అపరాధం నాదిగా భావించి అందరూ నన్ను క్షమించవలసినదిగా కోరుతున్నాను" అంటూ వేడుకున్నాడు.

ఆ తరువాత వాసుదేవరావు కనబడితే అందరూ ముఖాలు తిప్పకోవటం ప్రారంభించారు. ఈ ఊళ్ళో మనుష్యులకు చదువూ సంస్కారం లేదని వాసుదేవరావనుకున్నాడు.

ఈ సభనుగురించి అన్ని వివరాలు పత్రికలద్వారా విన్న శంకర్, వాసు తన ప్రతిభను ఆ ఊరివారికి కూడా చూపించాడని నవ్వుకున్నాడు.

వాసు మాత్రం తనవెంట శంకర్ లేనందుకు సంతోషించాడు. తనకా మాత్రం స్వేచ్ఛ లభించినందుకు తనను తనే అభినందించుకున్నాడు. నాలుగురిలో తన గౌరవాన్ని తానే నిలుపుకున్నానన్న గర్వం కూడా కలిగింది.

అవును మరి, తనవలె అన్ని గ్రంథాలు తిరగవేసినవాడు తన కంటికి మరొకడు కనబడితేగా ? ఒకవేళ చదివినా వాటిని అర్థం చేసుకోగలరా ? అంతటి సంస్కారం ఎవరికుంది కనుక ?

❀❀